అకాల వర్షం.. అపార నష్టం

- గాలివాన బీభత్సం
- నేల కూలిన చెట్లు
- ధ్వంసమైన వాహనాలు
- తడిసిన ధాన్యం


చోడవరంలో తడిసిన ధాన్యం


గోసాలలో నేల కూలిన అరటితోట

పెనమలూరు: నియోజకవర్గ పరిధిలో ఆదివారం ఉదయం హఠాత్తుగా వచ్చిన గాలివాన బీభత్సంలో జనజీవనం అతలాకుతలమయింది. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో ఉదయం గంట పాటు విపరీతమైన గాలితో వర్షం కురిసింది. జాతీయ రహదారిపై మోకాటి లోతు వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్లు విరిగి పడటంతో విద్యుత్, ఇంటర్నెట్, కేబుల్ సేవలు నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళితే.. ఆదివారం ఉదయం వాతావరణం ఒక్కసారిగా మారిపోయి గాలి వాన బీభత్సం సృష్టించింది. వాతావరణంపై ముందస్తు హెచ్చరికలు లేకపోవడంతో జనాలు భయంతో పరుగులు తీశారు. తుపానును తలపించే విధంగా జోరుగా గాలి రావడంతో మహావృక్షాలు నేలకు ఒరిగాయి. విద్యుత్ తీగలు తెగిపోయాయి. జనజీవనానికి ఇబ్బందులు తలెత్తాయి.

జాతీయ రహదారిపై నీరు

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా పోరంకి సెంటర్, కామయ్యతోపు, పప్పుల మిల్లు వద్ద పెద్ద ఎత్తున నీరు రోడ్డుపై నిలిచిపోయింది. బందరు రోడ్డుపై భారీగా వర్షం నీరు, డ్రెయినేజీ నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నేల కూలిన వృక్షాలు

గాలివాన బీభత్సంతో గ్రామాల్లో మహావృక్షాలు నేల కూలాయి. పోరంకి విష్ణుపురం కాలనీలో వృక్షాలు కార్లపై పడటంతో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. పెనమలూరు సెంటర్ వద్ద వృక్షం పడటంతో ఆటో పూర్తిగా దెబ్బతింది. విద్యుత్ తీగలు తెగిపోవడంతో చాలా ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేదు. దీంతో నీటి సమస్య కూడా ఏర్పడింది. అలాగే మండల పరిధిలో గాలి వానకు చేతికి వచ్చిన ధాన్యం వర్షానికి తడవగా, పంట కోతకు కొద్దిరోజులు గడువు ఉండగా అరటి తోట నేలమట్టమయింది. చోడవరం, పెదపులిపాక, వణుకూరు ప్రాంతాలకు చెందిన రైతులు నష్టపోయారు. వర్షం కారణంగా ధాన్యం తడిచిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేలరాలిన మామిడి

విజయవాడరూరల్: ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి మామిడి రైతులకు అపారనష్టం ఏర్పడింది. రూరల్ మండలంలో అధికంగా మామిడి తోటలున్న నున్న, పాతపాడు, కొత్తూరు తాడేపల్లి, పి.నైనవరం గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. సరిగా కాపు లేదని, మంగు, మచ్చలతో అంతంత మాత్రంగా మామిడి దిగుబడులున్నాయనే దిగులుకు తోడు అకాల వర్షం రైతులను మరింత కుంగతీసింది. నష్టపోయిన మామిడి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జనజీవనం అస్తవ్యస్తం


ఉయ్యూరు-కాటూరు ఆర్అండ్‌బీ రోడ్డుపై నేలకూలిన చెట్టు

ఉయ్యూరు: అకాల వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఉయ్యూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు నేల వాలాయి. ఉయ్యూరు-కాటూరు ఆర్అండ్‌బీ రహదారిపై మార్కెట్ యార్డు ఎదురుగా భారీ వృక్షం నేలవాలడంతో ట్రాఫిక్ స్తంభించింది. కడవకొల్లు, వీరవల్లి మొఖాసా ప్రాంతాల్లో చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. ఆకునూరు, పెద ఓగిరాల, చిన ఓగిరాల, గండిగుంట గ్రామాల్లోనూ చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించి సరఫరాను పునరుద్ధరించారు. తహసీల్దార్ సురేష్‌కుమార్ పలు ప్రాంతాల్లో పర్యటించి సహాయ చర్యలను పర్యవేక్షించారు.

రోడ్లపై నిలిచిన వర్షం నీరు


పి.నైనవరంలో రోడ్డుపై వర్షం నీరు

పి.నైనవరం(విజయవాడరూరల్): ఈదురుగాలులతో ఆదివారం కురిసిన వర్షానికి పి.నైనవరం గ్రామంలో కొండలపై నుంచి నీరు వాగుల్లో ప్రవహించి ఆర్అండ్‌బీ రోడ్డు పైకి చేరింది. రోడ్డుపై నీరు ప్రవహించడంతో గ్రామప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాలువ లేకపోవడంతో వర్షం నీరుపోయే మార్గం లేక రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. డ్రెయినేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు పంచాయతీ పాలకవర్గానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నున్న గ్రామంలో కూడా వర్షం నీరు రోడ్లపై నిలిచిపోయింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం


చెరువును తలపిస్తున్న కంకిపాడు బస్టాండు ప్రాంగణం

కంకిపాడు: అకాల వర్షంతో జనజీవనం స్తంభించింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీయడంతో భారీ వృక్షాలు సైతం నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కుండపోతగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం పడింది. సుమారు అర్ధగంటకు పైగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈడుపుగల్లు ప్రధాన రోడ్డులో నాలుగు చోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో ప్రహరీ గోడపై అమర్చిన రేకులు, ప్రధాన గేటు, వాటరు ట్యాంకు ధ్వంసమయ్యాయి. వర్షం కారణంగా రూ. 5 లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు సంస్థ అధికారులు జిల్లా కలెక్టరుకు నివేదిక సమర్పించారు. స్విమ్మింగ్‌పూల్ ప్రధాన గేటు సమీపంలో భారీచెట్టు కూలడంతో ఆ మార్గం గుండా వెళ్తున్న కారు ధ్వంసమైంది. దీంతో పాటు ద్విచక్రవాహనం దెబ్బతింది. కంకిపాడు బస్టాండు సమీపంలోనూ ట్రాఫిక్ అవుట్ పోస్టు కూలి ద్విచక్రవాహనం ధ్వంసమైంది. కంకిపాడు చెత్త సంపద కేంద్రం, గొడవర్రు ప్రధాన రహదారుల్లో చెట్లు కూలడంతో రాకపోకలు స్తంభించాయి. ఆయా గ్రామ పంచాయతీల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో స్పందించి చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. చెట్లు కూలడంతో 25 విద్యుత్ స్తంభాలు, పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి మధ్యాహ్నంకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. వర్షానికి గోసాల సెంటరు, కంకిపాడు బస్టాండు, రైతుబజారు ప్రాంతాలు నీట మునిగాయి.

ఆందోళనలో మొక్కజొన్న రైతులు

అకాల వర్షంతో రైతులకు కష్టం వచ్చిపడింది. చేతికొచ్చిన ధాన్యం, మొక్కజొన్న పంటలు వర్షానికి తడిచిపోయాయి. మొక్కజొన్న నలుపు రంగుకు మారి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం రాశులు తడిచిపోయాయి. బస్తాల్లో నింపిన ధాన్యం తేమ కారణంగా మొలకెత్తే అవకాశం ఉండటంతో తిరిగి బస్తాల్లో ధాన్యం ఆరబోసి మరలా కాటా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అదనపు పెట్టుబడులు తమపై భారంగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న మద్దతు ధరకు కొనేలా కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.


కంకిపాడు పరిధిలో తెగిపడిన విద్యుత్‌లైన్లు


పోరంకిలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై వర్షం నీరు

క్లుప్తంగా

ప్రశాంతంగా నీట్ పరీక్ష



విజయవాడరూరల్: నున్న గ్రామం వికాస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన నీట్ ఎంట్రన్స్ పరీక్షకు మొత్తం 480 మంది అభ్యర్థులకుగాను 474 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

విభిన్న పాత్రల్లో నటించాలని ఉంది



హనుమాన్‌జంక్షన్ రూరల్: విభిన్న పాత్రల్లో నటించి ప్రేక్షకుల అభిమానం పొందడమే తన అభిలాష అని సినీ నటుడు, ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ నివాసానికి ఆదివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఛాలెంజింగ్ క్యారెక్టర్స్ చేయాలనే కోరిక ఉందన్నారు. మిమిక్రీ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌లో ఇప్పటి వరకు దేశ, విదేశాల్లో తొమ్మిది వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చానని తెలిపారు. విదేశీగడ్డపై వెయ్యికిపైగా ప్రదర్శనలు నిర్వహించామని పేర్కొన్నారు.

కరాటే విద్యార్థులకు అభినందన



పాయకాపురం(విజయవాడరూరల్): హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం పొందిన క్యోఇకు కరాటే అకాడమీ విద్యార్థులను నార్త్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ స్రవంతి రాయ్ అభినందించారు. ఆదివారం పాయకాపురంలోని కరాటే అకాడమీలో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో గత నెల 27వ తేదీన హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పోటీల్లో రికార్డు సాధించిన కరాటే విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చీఫ్ ముత్యాల కరుణాకర్, క్యోఇకు కరాటే అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నటరాజుకు నాట్య వినోదం



విజయవాడకల్చరల్: నాట్యాచార్యుడు డాక్టర్ చింతారవి బాలకృష్ణ నృత్యశిక్షణలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించే కూచిపూడి నృత్య రంగ ప్రవేశం ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు కార్యక్రమంలో వల్లభజోస్యుల శ్రీదత్త ప్రదర్శించిన అంశాలు నేత్ర పర్వంగా సాగాయి. నర్తనగణపతి, చిందబరీశ్వర స్తవం, పదము, నగుమోము, థిల్లానా అంశాలను ప్రదర్శించారు. నృత్య సంప్రదాయాన్ని పాటించి లైవ్ కార్యక్రమంగా సాగిన కార్యక్రమంలో నట్టువాంగం డాక్టర్ చింతారవి బాలకృష్ణ, గాత్రం సీహెచ్ శ్రీనివాస్, మృదంగం పసుమర్తి హరినాథ్, వయొలిన్ పాలపర్తి ఆంజనేయులు, వేణువుతో కుమార్ బాబు సహకరించారు. కార్యక్రమంలో వల్లభజోస్యుల పవన్, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

నాట్యాచార్యులకు గురు సత్కారం

శ్రీదత్త అరంగేట్రం సందర్భంగా సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణ నాట్యాచార్యులు పసుమర్తి శ్రీనివాస్, సీహెచ్ అజయ్‌కుమార్, నాట్యాచారిణి యల్లా జోస్యుల అనురాధ, పద్మశ్రీ హేమంత్, ఉషామాధవిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగిస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏపీ సెక్యూరిటీ గార్డ్స్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిబాబు మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు


గన్నవరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


తెన్నేరు గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

గన్నవరం: మండలంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక మండల పరిషత్ ఆవరణలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం గ్రంథాలయ కమిటీ సభ్యుడు చిమట రామారావు పర్యవేక్షణలో విద్యార్థులకు కథలు చదివి వినిపించడం, స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ముస్తాబాద, పురుషోత్తపట్నం గ్రంథాలయాల్లో జరిగిన విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కంకిపాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్ సునీత అన్నారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా చిన్నారులతో యోగాసనాలు వేయించారు. అనంతరం పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. అలాగే కంకిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌లో 1994-95 బ్యాచ్ విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ సందడిగా జరిగింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి స్నేహానుభూతులను పంచుకున్నారు. 30 వసంతాల తర్వాత 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులు కుశల ప్రశ్నలు వేసుకుంటూ బాల్యంలోని మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పూర్వ విద్యార్థులంతా పాఠశాల ప్రాంగణంలో మళ్లీ చిన్నపిల్లల్లా మారిపోయారు. రోజంతా బాల్యమిత్రులతో హుషారుగా, సంతోషంగా గడిపారు. తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని, గతంలోనూ రూ.3.50 లక్షల వ్యయంతో విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటుగా, దాని నిర్వహణ బాధ్యతలను కూడా తామే వహిస్తున్నామని గుర్తు చేశారు. భవిష్యత్‌లోనూ ఇదే సహకారం అందిస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థులు చందు శ్రీనివాసరావు, ఇతర మిత్రులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం జక్కంపూడి వైఎస్సార్‌కాలనీకి చెందిన బ్లాక్‌నంబర్ 109లో కొమ్మల బుజ్జి, తిరుపతిరావు దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. కుమార్తె(13) శుక్రవారం రాత్రి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే స్నేహితుల వద్దకు వెళ్లి ఉంటుందని భావించారు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేదు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రాణశక్తి పెంపుతో నొప్పుల నివారణ


కానూరులో నొప్పులపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

పెనమలూరు: ప్రాణశక్తి పెంపుతో దేహంలోని నొప్పులు పరిష్కరించగలుగుతామని యోగాశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ పేర్కొన్నారు. కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నొప్పులపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒంటి నొప్పులు రెండు రకాలని.. అవి బాహ్య నొప్పులు, అంతర్ కారణాల నొప్పులని తెలిపారు. బాహ్య కారణాలతో వచ్చే నొప్పులు ప్రాణశక్తి పెంపుతో నయమవుతాయన్నారు. అంతరంగా లివర్, గాల్‌బ్లాడర్, కిడ్నీలు, గుండె, పెద్ద, చిన్న పేగు పనితీరులో వచ్చే మార్పులే కారణమన్నారు. మనలో ప్రాణ శక్తి కేంద్రాలను చైతన్యపర్చడం వల్ల సమస్యలు నివారించవచ్చని వివరించారు. యోగా చేయడం వల్ల కూడా సమస్యను పరిష్కరించగలుగుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆక్యూ తెరపిష్టులు పల్నాటి రామ్‌ప్రసాద్, నాగమణి, కరుణాకర్, స్థానికులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం


గన్నవరంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

గన్నవరం: భారీ ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. అయితే ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం పూర్తిగా మేఘవృతమై అతి వేగంతో కూడిన ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. గన్నవరం పట్టణంలోని పలు లోతట్టు రహదారులపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గాలుల దాటికి పలుచోట్ల చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గాలుల తీవ్రతకు మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది.

కుమార్తె అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): కుమార్తె కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లనపల్లి వీరమ్మ కుటుంబం వన్‌టౌన్ మల్లికార్జునపేటలో నివసిస్తోంది. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు. మూడో కుమార్తె పోత్రు వెంకటేశ్వరమ్మకు మంటాడకు చెందిన పోత్రు సాయికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి బాబు తేజ(5) సంతానం. భార్యభర్తల మధ్య గొడవ కారణంగా వెంకటేశ్వరమ్మ పుట్టింటి వద్ద ఉంటోంది. వారం క్రితం అత్తగారి ఊరు మంటాడ వెళ్లింది. ఈ నెల ఒకటవ తేదీన వెంకటేశ్వరమ్మ నున్న గ్రామంలో ఉంటున్న తన అక్క సత్తెమ్మ ఇంటికి వచ్చి కొడుకును వదిలి వెళ్లిపోయినట్లు ఫిర్యాదు చేశారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం బెంగళూరుకు చెందిన నృత్య విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. బెంగళూరుకు చెందిన మునిపల్లి మహతి పర్యవేక్షణలో సుమారు 19 మంది విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను పలువురు భక్తులు అభినందించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆధార్ కార్డు నమోదు, సవరణల నిమిత్తం ఈనెల ఐదవ తేదీ నుంచి గ్రామ గ్రామాన ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కే జోగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో మల్లవల్లి, కానుమోలు, బండారుగూడెం గ్రామాల్లోనూ, 7, 8 తేదీల్లో రేమల్లే, కోడూరుపాడు, ఆరుగొలను గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లుగా వివరించారు. అలాగే 12, 13 తేదీల్లో వేలేరు, వీరవల్లి, ఓగిరాల గ్రామాల్లో, 14, 15 తేదీల్లో బాపులపాడు, రంగన్నగూడెం, తిప్పనగుంట గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు చేయడం, ఐదేళ్లు నిండిన చిన్నారులకు ఆధార్ అప్‌డేట్, పేరు, చిరునామాల సవరణలు వంటి సేవలు ఈ శిబిరాల్లో నిర్వహిస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్వర్ణభారత్‌లో పలు కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పలు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ అమరేశ్వర రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్, నార సంచుల తయారీ, సెల్‌ఫోన్ రిపేరు, పుట్టగొడుగుల పెంపకం, కొవ్వొత్తులు, అగరవత్తుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు 94900 11081, 63042 54730 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కంప్యూటర్ అప్లికేషన్స్‌పై శిక్షణ

డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ నేతృత్వంలో పీజీ డిప్లొమో కంప్యూటర్ అప్లికేషన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు సొసైటీ ప్రతినిధి అంకమరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో జరిగే ఈ కోర్సు శిక్షణకు ఆసక్తి కలిగిన వారు 91000 33552, 80949 32997 నంబర్లను సంప్రదించాలని కోరారు.